క్లుప్తంగా

ఉపాధ్యాయులకు నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ గంగిరెడ్డి

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఎస్‌సీఈఆర్‌టీ స్టేట్ అబ్జర్వర్ గంగిరెడ్డి అన్నారు. బీకేఎస్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న విజయ భారతి డీఈడీ కళాశాలలో 5వ స్పెల్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అభ్యసనను పూర్తిస్థాయిలో మెరుగు పరుచుకోవడానికి పాఠశాల విద్యాశాఖ ఎస్ఎస్ఏ, ఎస్ఈఈఆర్‌టీ విద్యాసంస్థల ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓలు ఓబులపతి, గురుప్రసాద్, డైట్ కళాశాల అధికారి శ్రీనివాసులు, కేఆర్‌పీ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

గుంతకల్లుటౌన్: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని 32, 33వ వార్డు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

బాధిత రైతును ఆదుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

బుక్కరాయసముద్రం: కొర్రపాడు గ్రామంలో మామిడి తోట అగ్నికి ఆహుతై నష్టపోయిన రైతుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం అగ్నికి ఆహుతైపోయిన మామిడి తోటను సీపీఎం పార్టీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ కొర్రపాడు గ్రామానికి చెందిన వెంకటకొండకు చెందిన ఐదు ఎకరాల మామిడి తోట అగ్నికి ఆహుతై పోవడంతో చెట్లతో పాటు డ్రిప్పు, పైపులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఉద్యాన శాఖ అధికారులు పర్యటించి నష్టపోయిన రైతుకు ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి: పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పీజీటీ ఇంగ్లిష్, పీఈటీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ లత కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

సంక్రాంతికి పశువుల షెడ్లు ప్రారంభిస్తాం



మాట్లాడుతున్న పీడీ సలీంబాషా

యల్లనూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశువుల షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, సంక్రాంతికి జిల్లాలోని అన్ని పశువుల షెడ్లను పూర్తి చేసి ప్రారంభిస్తామని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. మంగళవారం యల్లనూరు మండలాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిట్టూరు గ్రామంలో జరుగుతున్న పశువుల షెడ్ల నిర్మాణాలు, కోళ్లఫారం పనులను పరిశీలించారు. అనంతరం రైతులు హార్టీకల్చర్ కింద సాగు చేస్తున్న మామిడి మొక్కలను పరిశీలించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సంక్రాంతికి పశువుల షెడ్ల నిర్మాణాలు పెండింగ్ ఉండరాదన్నారు. టెక్నికల్ , ఫీల్డ్‌అసిస్టెంట్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. రిజిష్టర్లు సక్రమంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, పీఆర్ జేఈ నరేంద్ర, ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టీఏలు ప్రతాప్, అదిల్, శంకర్, శ్రీనివాసులు, నరేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

గుత్తి: విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ కోరారు. పట్టణంలోని ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో మంగళవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఆధార్.. బేజార్!



- కార్డులో మార్పులు, చేర్పులకు ప్రజలకు తిప్పలు
- తెల్లవారుజాము 3.30 గంటల నుంచే కేంద్రాల వద్ద పడిగాపులు

గుత్తి: గుత్తిలో ఆధార్ కేంద్రాల వద్ద జనాలు రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. తెల్లవారుజామున మూడున్నర గంటల నుంచే ఆధార్ కేంద్రాలకు చేరుకుని నిరీక్షిస్తున్నారు. ఒక్కో ఆధార్ కేంద్రంలో రోజుకు కేవలం 40 మంది ఆధార్ మాత్రమే కరెక్షన్ చేస్తున్నారు. దీంతో తెల్లవారు జామునే ఆధార్ కేంద్రాలకు వెళ్లి చలికి వణికిపోతున్నారు. వివరాలు,, గుత్తి మున్సిపాలిటీలో కేవలం మూడు ఆధార్ కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఆధార్‌లో విద్యార్థితో పాటు తల్లిదండ్రుల పేర్లు, ఇంటిపేర్లు, ఇతరత్రా తప్పులు ఉంటే వెంటనే కరెక్షన్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. గుత్తి మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వారు ఆధార్‌లో మార్పుల కోసం గుత్తిలోని ఆధార్ కేంద్రాలకు వస్తున్నారు. దీంతో ఆధార్ కేంద్రాలు ఉదయం నుంచి సాయంత్రం దాకా కిక్కిరిసిపోతున్నాయి. సరిపడినన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. ఆధార్‌లో మార్పుల కోసం ఒక్కొక్కరూ కేంద్రాలకు నాలుగైదు సార్లు రావలసి వస్తోంది. దీంతో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. డబ్బు, సమయం వృథా అవుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుత్తిలోని ఆధార్ కేంద్రాలకు వచ్చారు. తెల్లవారుజామున మూడున్నర గంటలకే చలిలో వణుకుతూ ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. చలికి తట్టుకోలేక చలి మంటలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఆధార్ కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు.



గుత్తిలో ఆధార్ కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

వారం రోజులుగా తిరుగుతున్నా..



ఆధార్‌లో పేరు తప్పు ఉండటంతో కరెక్షన్ కోసం వారం రోజులుగా ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నా. అయినా ఆధార్ కరెక్షన్ కాలేదు. డబ్బుతో పాటు సమయం వృథా అవుతోంది. గ్రామాల్లోనే ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

–చితంబర రెడ్డి, తురకపల్లి

మూడు గంటలకే ఆధార్ కేంద్రానికి వెళ్లా



రోజుకు కేవలం 40 మందికి మాత్రమే ఆధార్ కరెక్షన్ చేస్తున్నారు. దీంతో తెల్లవారు జామున మూడు గంటలకే ఆధార్ కేంద్రానికి చేరుకుని చలికి వణికిపోయాను. అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచాలి.

–పాండు, తొండపాడు

చలికి వణికిపోతున్నాం



పేరులో కరెక్షన్ కోసం నాలుగు రోజులుగా ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నా. రోజుకు 40 మందికి మాత్రమే చేస్తున్నారు. తెల్లవారు జామున మూడున్నర గంటలకే ఆధార్ కేంద్రాలకు చేరుకుంటున్నా. చలికి వణికిపోతున్నా.. అయినా పని కావడం లేదు.

–శ్రీనివాసులు, గుత్తి

ఇబ్బందులు పడుతున్నాం



ఆధార్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పనులు వదులుకుని ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. డబ్బులు వృథా అవుతున్నాయి. అధికారులు స్పందించి ప్రజలకు తగినన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– నాగరాజు, ఇసురాళ్లపల్లి

ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచేలా చూస్తాం



మున్సిపాలిటీ పరిధిలో మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆధార్ కేంద్రాలను పెంచాల్సిన అవసరం ఉంది. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచడానికి ప్రయత్నిస్తాం.

–జబ్బార్ మియా, మున్సిపల్ కమిషనర్ గుత్తి

సెమీ క్రిస్మస్ వేడుకలు జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న ఆర్టీటీ స్కూల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలని కాలనీవాసులు మంగళవారం కోరారు. స్థానిక బందెల వారి ఆధ్వర్యంలో కసుంపల్లి పాస్టర్ రెవరెండ్ డానియల్ అధ్యక్షతన నిర్వహించే ఈ వేడుకలకు గుంటూరు బైబిల్ మిషన్ ఏఓ రెవరెండ్ బందెల రాజు ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేయనున్నారన్నారు. వేడుకల అనంతరం ప్రేమవిందు ఉంటుందన్నారు. వేడుకల్లో క్రైస్తవులు, క్రైస్తవేతరులు పాల్గొని దేవుడి అనుగ్రహం పొందాలన్నారు.

జూదరుల అరెస్ట్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గిరిప్రసాద్‌నగర్ కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. స్థానికుల సమాచారంతో పోలీసు సిబ్బంది మెరుపు దాడి నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.70,500 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి, కరిడికొండ, కొజ్జేపల్లి, బసినేపల్లి, వన్నేదొడ్డి, ఊబిచెర్ల, జక్కలచెరువు గ్రామాల్లోని సచివాలయాల్లో బుధవారం నుంచి ఉచిత ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చాలా మంది చిన్నారులకు ఆధార్ లేకపోవడంతో పాటుగా అప్‌డేట్ చేసుకోలేదన్నారు. ఆధార్ ఉచిత కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, ఆధార్‌లో మార్పు, పేర్లు నమోదు, ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలన్నారు. అదే విధంగా ఈ నెల 23, 24, 26, 27 తేదీల్లో ఇసురాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ కేంద్రం ఉంటుందన్నారు. ఆధార్ ఉచిత క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామీణ అభివృద్ధి ప్రణాళికపై సచివాలయ ఉద్యోగులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ. గ్రామాల్లో పేదలకు మౌలిక సదుపాయలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. ఎంపీడీఓ సాల్మాన్, ఈఓఆర్డీ సదాశివం తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై సచివాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల రెండో విడత శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, మాస్టర్ ట్రైనర్ శ్రీధర్‌గౌడ్ ప్రతిజ్ఞ చేయించి బాల్య వివాహాల నిర్మూలన గురించి అవగాహన కల్పించారు.

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల శిక్షణ మంగళవారం ముగిసింది. పంచాయతీల్లో అభివృద్ధి, సుస్థిర లక్ష్యాలపై ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్ వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. డీఎల్‌డీఓ లలితబాయి శిక్షణ కార్యక్రమం సందర్శించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం



తాడిపత్రిలో అధ్యక్షుడు సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న పెన్షనర్లు



గుంతకల్లులో పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం రిటైర్డ్ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో డి.ఎస్. నకార చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా 73 సంవత్సరాలు నిండిన రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీఓ మహ్మద్ ఫరూక్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, వీరారెడ్డి, ఆదినారాయణస్వామి, అశ్వర్థరెడ్డి, వెంకట్రామయ్య, రమణరాజు, కరుణాకర్, పెన్షనర్లు పాల్గొన్నారు.

గుంతకల్లు: జాతీయ పెన్షనర్స్ దినోత్సవ కార్యక్రమాన్ని గుంతకల్లు అర్బన్ అండ్ రూరల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షన్‌దారులు రాబియాబీ, విశాలాక్షి, వసంతకుమారి, సీ సుంకన్నలను ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మస్తానప్ప, వీరభద్రస్వామి, పీ.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్స్ దినోత్సవం అసోసియేషన్ నాయకులు ఈఓ రాముడు, జీయం చలపతి తదితరులు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

గుత్తి: పెన్షనర్ల సమస్యలను పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబూ బకర్, రామ్మోహన్, సభ్యులు ఫకృద్దీన్, కుల్లాయి స్వామి, వెంకటేష్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు పీహెచ్ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ సాధారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ పట్టణ అధ్యక్షుడిగా జగదీష్, ప్రధాన కార్యదర్శిగా సాకే నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగేంద్ర మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగ, కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే పక్షంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసయ్య, రమేష్, ఎస్.కె.ఎం.బాషా, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు రేష్మా, గంగా తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు వేగవంతంగా పరిష్కరిస్తాం

శింగనమల/యల్లనూరు/గుంతకల్లుటౌన్/పామిడి/యాడికి/గుత్తి రూరల్: రైతుల భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ జహీర్ అస్లాం అన్నారు. మంగళవారం శింగనమల మండలంలోని కల్లుమడి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. చిన్న చిన్న సమస్యలకు రైతులు ఘర్షణలు పడకుండా వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలాకుమారి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పునీత్‌కుమార్, మండల సర్వేయర్ వరకుమార్, ఎంపీటీసీ నల్లప్ప పాల్గొన్నారు.

- యల్లనూరు మండలంలోని వేములపల్లి, పెద్దమల్లేపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజా, ఆర్‌ఐ నారాయణమ్మ, వీఆర్వోలు వినోద్, శివ ప్రకాష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.
- గుంతకల్లు మండలంలోని పాతగుంతకల్లులో ఉన్న అంకాలమ్మ గుడి ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్‌డీఓ శ్రీనివాస్ రెవెన్యూ సదస్సును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, నోడల్ అధికారి సారయ్య, కోదండరామస్వామి ఆలయ ఈఓ మఠం మల్లికార్జున, సర్వేయర్ మారెప్ప తదితరులు పాల్గొన్నారు.
- పామిడి మండలంలోని పాళ్యం, కత్రిమల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి , ఎంపీడీఓ తేజోత్స్న, సర్వేయర్ మురళీధర్, ఈఓ క్రిష్ణయ్య, రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
- యాడికి లోని సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ క్రిష్ణప్ప, దేవదాయశాఖ ఈఓ దుర్గా ప్రసాద్, వీర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- గుత్తి మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఓబులేసు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ చిదంబరి, వీఆర్ఓలు సురేంద్ర, కిశోర్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త సుబ్రమణ్యం

యాడికి: నిమ్మ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం మండలంలోని కోనుప్పలపాడులో నిమ్మ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త నిమ్మ పంటకు వచ్చే వేరుకుళ్లు, బంక, నల్లమంగు, పులుసు పురుగు తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పచ్చి ఆకు ఎరువులు చెట్టు మొదళ్లలో ఒక కిలో చెప్పున వేసి మట్టిని కప్పాలన్నారు. ఎం45 లేదా బావిస్టన్ మూడు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పది నుంచి 12 లీటర్ల నీటిని చెట్టు పాదుల్లో పోయాలన్నారు. బంకు తెగులు నివారణకు అలైట్ 2 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా రిడోమిల్ గోల్డ్ స్ప్రే చేయాలన్నారు. పశువుల ఎరువు 90 కేజీలు బెల్లం సరిపడనంత మిశ్రమాన్ని కలిపి పది రోజుల తర్వాత చెట్టుకు 10 కిలోలు అందించాలన్నారు. కార్య క్రమంలో సర్పంచు రామలక్షుమ్మ, ఉద్యాన శాఖాధికారిణి ఉమాదేవి, వీహెచ్ఏ రవి కుమార్, రైతులు పాల్గొన్నారు.

23న టెంకాయలు, తలనీలాల వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా మండలంలోని అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయలు, లడ్డు ప్రసాదాల విక్రయం, తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈ నెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెంకాయలు విక్రయం , తలనీలాల సేకరణవేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు. కొబ్బరి చిప్పలు, పోగు చేసుకునే హక్కు, లడ్డు ప్రసాదాల విక్రయం హక్కు వేలంలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

గుత్తి/పామిడి: గుత్తి పట్టణంలోని అతిపురాతనమైన, పవిత్రమైన శ్రీరామస్వామి దేవాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. అలాగే పామిడి పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. వేకువజామునే భక్తులు ఆలయానికి చేరుకుని తిరుప్పావై పాశురాన్ని, భగవద్గీత స్తోత్ర పారాయణం గావించారు. వాసవీమాతకు అభిషేక పూజలు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: మండలంలోని తిప్పారెడ్డి పల్లి క్రాస్ వద్ద మంగళవారం సాయంత్రం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రి మండలం గంగాదేవిపల్లికి చెందిన యుగంధర్ ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా, కేసు నమోదు చేశామన్నారు.

సంక్షిప్త వార్తలు

వైభవంగా రమణ మహర్షి జయంతి

తాడిపత్రి అర్బన్: స్థానిక శివాలయం సమీపంలోని రమణ మహర్షి ఆశ్రమంలో వ్యవస్థాపకుడు వి.వి. బ్రహ్మం ఆద్వర్యంలో మంగళవారం రమణ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా రమణ మహర్షి చిత్ర పటానికి పూజలు చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఏఈ మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కల్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలన్నారు.

చెరువులకు నీరు అందించాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా చెరువులకు సాగునీరందించాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మర్తాడు, కోటంక, గ్రామాల్లోని చెరువులకు పీఏబీఆర్, హెచ్చెల్సీ కాలువ ద్వారా సాగు నీరు నింపాలన్నారు. అలాగే కోటంక సుబ్రహ్మణ్యంస్వామి దేవాలయం వరకూ తారు రోడ్డు నిర్మించాలన్నారు. అలాగే పొలాల్లో స్మార్ట్ మీటర్లు బిగించరాదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బుక్కరాయసముద్రం: మండలంలోని వడియంపేట గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. 18 బ్యాగుల బియ్యంతో పాటు ఐచర్ వాహనాన్ని సీజ్ చేశామన్నారు. సీఎస్‌డీటీ నారాయణస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతి మృతి

తాడిపత్రి: మనస్తాపంతో సూపర్‌వాస్మాల్ తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి యమున (19) మంగళవారం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆంజనేయస్వామి మాన్యానికి చెందిన యమున బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. విజయవాడ లేదా గుంటూరు పరిధిలో ఉద్యోగం లభించే అవకాశం వచ్చింది. అందుకు కాస్త డబ్బు చెల్లించాల్సిన అవసరం రావడంతో తల్లి చంద్రకళతో డబ్బు విషయమై చర్చించింది. డబ్బు లేదని తల్లి తెలపడంతో మనస్తాపానికి గురైన యమున ఈ నెల 13న ఇంట్లో సూపర్‌వాస్మోల్ తాగింది. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

పెద్దవడుగూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథరెడ్డి, పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అమర్‌నాథ్ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలన్నారు. హెచ్ఎం సుధాకర్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఏఎన్ఎం రాజీ, ఆశా వర్కర్లు ఉమాదేవి, జమాల్‌బీ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

గుత్తి: స్థల వివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తిలోని నవాజ్‌కట్ల వీధిలో నివాసముంటున్న ఫకృద్దీన్‌కు, కమాటం వీధికి చెందిన గోరా మాబుకు మధ్య కొంత కాలంగా స్థల వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం గోరా మాబు, ఖలీల్, మైను మరో ఐదుగురితో కలసి నవాజ్ కట్ట వీధికి వచ్చి ఫకృద్దీన్, ఆయన కుటుంబసభ్యులపై రాళ్లతో దాడి చేశారు. దాడిలో ఫకృద్దీన్, ఆయన కుమారుడు షఫీ, మరదలు షాహినా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. పరిస్థితి విషమంగా ఉన్న ఫకృద్దీన్, షాహినాను అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణ మద్యం పట్టివేత

తాడిపత్రి: తెలంగాణ నుంచి అక్రమంగా కారులో తరలిస్తున్న మద్యాన్ని తాడిపత్రి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. సీఐ సాయిప్రసాద్ తెలిపిన మేరకు... తెలంగాణాకు చెందిన తాళ్ల గోపిరెడ్డి, మండే నరసింహారావు, తాడిపత్రి మండలం, బ్రాహ్మణపల్లికి చెందిన మిట్టమీద దస్తగిరి, నంద్యాల జిల్లా, వెంకటాపురానికి చెందిన సొంటి సుధాకర్ మంగళవారం 48 బ్లాక్‌డాగ్ ఫుల్ బాటిళ్లను డిజైర్ కారులో తాడిపత్రికి తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితులు నలుగురిని అరెస్ట్ చేసి, మద్యం బాటిళ్లతో పాటు కారును సీజ్ చేశారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.44 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.